ఓల్డ్ ఐటీఐకి.. మహర్దశ

కేంద్ర ప్రభుత్వ ఉపాధి శిక్షణకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక

దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలకు రూ. 60 వేల కోట్ల మంజూరు

అక్టోబర్ 2న హబ్ స్పోక్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న ప్రధాని మోదీ

కంచరపాలెం: పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఓల్డ్ ఐటీఐ)కి మంచి రోజులు రానున్నాయి. ఐటీఐల్లో ఉపాధి శిక్షణ కల్పనకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కంచరపాలెం ఓల్డ్ ఐటీఐని ఎంపిక చేసింది. ఓల్డ్ ఐటీఐ ఉత్తీర్ణతలో, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు చూపడంలో నంబర్ వన్ స్థానంలో నిలవడంతో కేంద్రం ప్రభుత్వ అవార్డులు అందుతున్నాయి.

25 ఏళ్ల క్రితం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో (ఐటీఐ) చదివిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉండేది. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు సులువుగా లభించేవి. రైల్వే, ఏపీఎస్ఆర్టీసీ, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, బీహెచ్‌పీవీ, డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించేవి. అనాడు ఐటీఐ చేసి వెంటనే అప్రెంటిస్ చేసిన విద్యార్థులు ఇట్టే కొలువులు సంపాదించేవారు. నేటి కాలంలో ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ రంగ సంస్థలు అడుగులు వేయడంతో ఉపాధి–ఉద్యోగావకాశాలు ప్రశ్నార్థకంగా మారాయి. రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు పెరగడంతో చాలా మంది విద్యార్థులు ఐటీఐల వైపు వెళ్లకుండా, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంల్లో తప్పితే ప్రైవేటు ఐటీఐల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. నేడు ఇలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు శుభ వార్త చెప్పింది. విశాఖలో ప్రభుత్వ పాత ఐటీఐ స్వరూపం మరికొద్ది రోజుల్లో మారనుంది. కేంద్ర ప్రభుత్వం ఐటీఐలను ఆధునికీకరించి, అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో సుమారు 81 ప్రభుత్వ ఐటీఐలు ఉండగా కేంద్ర ప్రభుత్వం విశాఖలోని కంచరపాలెం పాత ఐటీఐని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీనిలో భాగంగా కంచరపాలెం పాత ఐటీఐకు రూ. 81 కోట్ల నిధులను మంజూరు చేయనున్నది. ఈ ప్రాజెక్టును అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ తెలిపారు.



కంచరపాలెంలోని ఓల్డ్ ఐటీఐ

పాత ఐటీఐకి ప్రథమ స్థానం..

కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ దక్షిణ భారత దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక శిక్షణ సంస్థగా గుర్తింపు పొంది ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రులు జయంత్ చౌదరి, **సుకంతా ముజుందార్ చేతుల మీదుగా ఉపాధి, పారిశ్రామిక శిక్షణ శాఖ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం, కంచరపాలెం** పాత ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ విజయానికి శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది తోడ్పాటు కారణమన్నారు.

ఐటీఐలకు మంచి రోజులు..



ఐటీఐలకు త్వరలో మంచి రోజులు రానున్నాయి. కంచరపాలెంలోని పాత ఐటీఐకి ఎంతో చరిత్ర ఉంది. రాష్ట్రంలో ఓల్డ్ ఐటీఐ ఉత్తీర్ణతలోనూ, ఉపాధి కల్పించడంలోనూ నంబర్–1 స్థానంలో ఉంది. ఐటీఐలలో మెరుగైన శిక్షణ ఇచ్చి, యువతకు ఉపాధి కల్పించడానికి ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం కింద నాలుగు కొత్త ట్రేడ్లతో పాటు మరో 10 ట్రేడ్లను గుర్తించి శిక్షణ ఇస్తాం. కేంద్రం 50 శాతం, రాష్ట్రం 33 శాతం, పరిశ్రమలు 17 శాతం నిధులు మంజూరు చేస్తాయి.

– జె.శ్రీకాంత్, కన్వీనర్, ప్రిన్సిపాల్, పాత ఐటీఐ కంచరపాలెం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు. పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్ (ఫైల్)


కేంద్ర ప్రభుత్వం నుంచి ఐటీఐకి వచ్చిన అవార్డులు

రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు


బడ్డీ తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్రిపాలెం : ఆపరేషన్ లంగ్స్ 2.0లో భాగంగా **జీవీఎంసీ 51వ వార్డు**లో మంగళవారం తోపుడు బళ్లు, బడ్డీలు, దుకాణాలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ మేరకు కళింగనగర్, మాధవధారలోని రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను క్రేన్ సహాయంతో తొలగించారు. దీంతో చిరు వ్యాపారుల పొట్ట కొట్టడం అన్యాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో కాలం నుంచి వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు వాపోయారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి దుర్మార్గపు పనులు ఎన్నడూ చేయలేదన్నారు. కూటమి నాయకులు ఆదుకుంటారని ఓటు వేసి గెలిపించామని, ఇలా రోడ్డున పడేసే రోజు వస్తుందని ఎన్నడూ ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వర్షం కారణంగా పూర్తి స్థాయిలో దుకాణాలు తొలగించ లేదు. బుధవారం కూడా తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని జీవీఎంసీ సిబ్బంది అంటున్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా భాషా



సీతంపేట : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ముస్లిం తాటిచెట్లపాలేనికి చెందిన షేక్ భాషా నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. భాషా ఇప్పటి వరకు కౌన్సిల్ విశాఖ నగర అధ్యక్షుడిగా సేవలందించారు. అతని సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం


బుల్లయ్య కళాశాల రోడ్‌లో జోరుగా కురుస్తున్న వర్షం

సీతంపేట : గత వారం రోజులుగా భానుడి ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారి వర్షం కురవడం ఆరంభించింది. రాత్రి వరకు ఒకే రీతిలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, డ్రెయిన్లు పొంగిపొర్లాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లైఓవర్, బీవీకే కళాశాల, సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, లలితానగర్ ప్రాంతాల్లో వర్షపు నీటితో రహదారులు జలమయమయ్యాయి. వాహనచోదకులు, పాదచారులు వర్షపు నీటి ప్రవాహంతో అవస్థలు పడ్డారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి పైనాపిల్‌కాలనీలో ఉన్న జిల్లా మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలు, గృహిణులకు పలు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం అక్టోబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డొమెస్టిక్ డాటా ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రైడరీ, అసిస్టెంట్ బ్యూటీథెరఫిస్ట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రెండు నెలలపాటు అందించే శిక్షణ పొందేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు గడువులోగా దరఖాస్తు చేస్తుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేయాలన్నారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6281261415, 8333921389లో సంప్రదించాలని ఆమె సూచించారు.

క్రైస్తవుల సమస్యలపై చర్చ


అతిథులను సత్కరిస్తున్న గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ నాయకులు

తాటిచెట్లపాలెం: స్థానిక గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో జాతీయ స్థాయి క్రైస్తవ నాయకుల, సేవకుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. బాప్టిస్ట్ మిషనరీకి చెందిన డాక్టర్ పాల్ విక్టర్ గరికిముక్కుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సదస్సు బుధవారం వరకు జరుగుతుంది. ఈ సదస్సులో డాక్టర్ ఇమ్మానుయేల్ రాబర్ట్స్ (వైస్ ప్రెసిడెంట్, ఎఫ్ఐ జీసీ), జోహని హాలోనెన్ (ఏఐసీసీ ప్రెసిడెంట్), డాక్టర్ లంక కరుణాకర్‌దాస్ (డైరెక్టర్ ఏఈ మిషన్), పాస్టర్ బాలసుందరం మాదే (జీసస్ మిషన్ చర్చి, ఆగ్రా) ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. మంగళవారం జరిగిన సెషన్స్‌లో వీరు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు గురించి వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాలు క్రైస్తవుల హక్కులు ఎలా హరిస్తున్నాయో తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో క్రైస్తవులపై, చర్చిలపై దాడులు పెరిగిపోయాయని, వీటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు పలువురు మాజీ ప్రభుత్వాధికారులు, మేధావులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు.

క్లైమేట్ చేంజ్ కోర్సు ప్రారంభం

తాటిచెట్లపాలెం: విశాఖలో కలెక్టివ్ సంస్థ, మహతి కాలేజ్ సంయుక్తంగా క్లైమేట్ చేంజ్‌లో నాలుగేళ్ల డేటా, ఏఐ కోర్స్‌ను ద్వారాకానగర్‌లో గల ప్రైవేట్ హోటల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో జి. ప్రతాప్‌రాజు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా ప్రకృతి విపత్తుల అధ్యయనం తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ కోర్స్‌ను విశాఖ చాంబర్‌ఆఫ్ కామర్స్, ఈపీడీసీఎల్ సహకారంతో అందిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా ఈ కోర్సు నేర్పుతున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ బాలప్రసాద్, వైజాగ్‌పటం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ మంగళగిరి సుదర్శన స్వామి, ఈపీడీసీఎల్ జనరల్ మేనేజర్ సుమన్ కళ్యాణి పాల్గొన్నారు.

ఘనంగా వైఎంసీఏ వార్షికోత్సవం

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ 50వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా విజయ ప్రధాన్, ఉపాధ్యక్షులుగా సదానంద మూసేస్, డైసీ బాబు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి.మ్యాథ్యూ పీటర్, కోశాధికారిగా కె.ఇజ్రాయిల్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ముగిసిన రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు



మాట్లాడుతున్న రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ

తాటిచెట్లపాలెం: సోమవారం ప్రారంభమైన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 11వ ద్వైవార్షిక సమావేశాలు మంగళవారంతో ముగిసాయి. వర్కింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలతో పాటు డెలిగేట్ సెషన్ కూడా జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రామిక్ కాంగ్రెస్ ఎల్లవేళలా కార్మికుల పక్షాన ఉంటుందని, అన్ని వేళల్లో ముందుండి నడిపించే నాయకుడు జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ నాయకత్వంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ట్రేడ్ యూనియన్‌లో నంబర్ –1గా నిలబెట్టారని ప్రశంసించారు. జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ మాట్లాడుతూ 8వ పే కమీషన్ ఏర్పాటు, అమలు, కరోనా సమయంలో 18 నెలల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని యాజమాన్యాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్, విధి నిర్వహణ ప్రాంతాల్లో వాష్‌రూంలు, రెస్ట్‌రూంలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. రన్నింగ్ స్టాఫ్ ప్రధాన సమస్య మినిమం గ్యారంటీ కిలోమీటర్లపై యూనియన్ ఆమరణ దీక్షలు చేపట్టిందని, దీని ఫలితంగా అధికారులు, యాజమాన్యం చర్చించి సానుకూలంగా స్పందించినట్లు వీరు తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. నరసింగరావు, వాల్తేర్ డివిజన్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మహేశ్వరావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరావు, ఆయా డివిజన్ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, యూనియన్ నాయకులు, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ చరిత్రను గ్రంథస్థం చేయాలి


సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థం చేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. చరిత్రకారులు, విశిష్ట ఆచార్యులను సంప్రదించి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రగతి, వికాసాలను గ్రంథంగా తీసుకొస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాన్ని రానున్న 50 ఏళ్లలో ఏవిధంగా అభివృద్ధి చేయాలి..., ఏ దిశగా నడిపించాలనే అంశాలపై ఒక విజన్ సిద్ధం చేయాలని సూచించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఏయూ నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆచార్యులు నిరంతరం పరిశోధనలు జరపడం, పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించడం విధిగా భావించాలన్నారు. అదేవిధంగా ఒక ప్రత్యేకమైన స్టడీ గ్రూపులను రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంతో తన చిన్నతనంలో ఉన్న అనుబంధాన్ని, విశాఖలో చదువుకున్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యులను ఉద్దేశించి శ్రీనివాస్ ప్రసంగించడం సంతోషకరమన్నారు. అనంతరం సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, జి.గిరిజ శంకర్, పద్మశ్రీ జి.శశిభూషణరావు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా



ఫిక్కీ ఫ్లో సభ్యులతో అతిథులు

తాటిచెట్లపాలెం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి) ఫ్లో సహకారంతో వాల్తేర్ డివిజన్ సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా హాజరై మాట్లాడారు. మహిళా సిబ్బంది కోసం పలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా అందుకు కారకులను వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో గల పలు యూనిట్లలో మహిళలకు ప్రత్యేక రెస్ట్‌రూంలు, వాష్‌రూం, లాకర్స్, చేంజింగ్ రూంలు ఏర్పాటు చేయాలని సీనియర్ డీఈఎన్‌లను ఆదేశించినట్లు తెలిపారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఈకార్వో ముందుంటుందని తెలిపారు. అంబ్రీన్ అంజుమ్ (ఫౌండర్, ఫిక్కిఫ్లో విజయవాడ చాప్టర్), డాక్టర్ వై. హేమ (మెంటార్, ట్రైనర్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్, పోష్), వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి, రైల్వే ఉద్యోగులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మార్మోగిన దుర్గమ్మ నామస్మరణ

ఆలయాలు, మండపాల్లో వైభవంగా పూజలు, కుంకుమార్చనలు


శ్రీలలితాపీఠంలో శరన్నవరాత్రి పూజలు


గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు


పాత రేసపువానిపాలెంలో గాయత్రీదేవి అలంకరణలో..


సీతంపేటలో గాయత్రీ దేవి అలంకరణలో పార్వతీ దేవి


శ్రీలలితాపీఠంలో ఆదిలక్ష్మి అలంకరణలో పద్మావతి

సీతంపేట : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవార్లు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో పద్మావతి అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల మధ్య శ్రీసుబ్రహ్మణ్యస్వామి సర్పసూక్త హోమం, మన్యుపాశుపత హోమం శాస్త్రోక్తకంగా జరిపించారు. పీఠంలో చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మవారి సన్నిధిలో, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు పీఠంలో ప్రత్యంగిరా భద్రాకాళీ హోమం, సుదర్శన హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

➡ సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి మంగళవారం గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు జరిపారు.

➡ పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గా దేవి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచ ముఖాలు, పది చేతులతో పసుపు రంగు చీరలో అమ్మవారు చూడముచ్చటగా దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

మద్రిపాలెం : మద్రిపాలెం జాతీయ రహదారిని ఆనుకుని పంజాబ్ హోటల్ జంక్షన్ సాయినగర్‌లో కొలువైన కాశీ విశ్వేశ్వర సమేత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో లలితా దేవి అమ్మవారు మంగళవారం బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.

మురళీనగర్ : జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంపులోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఓ వైపు చెత్త.. మరోవైపు అక్రమంగా పార్కింగ్


దొండపర్తి బ్రిడ్జిపై పేరుకుపోయిన చెత్త


దొండపర్తి బ్రిడ్జిపై అక్రమంగా నిలిపిన వాహనాలు

జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం లలితానగర్ బోరావారి వీధికి సమీపంలో దొండపర్తి గెడ్డపై ఉన్న బ్రిడ్జి చెత్తతో రోత పుట్టిస్తోంది. బ్రిడ్జిపై ఇష్టారాజ్యంగా చెత్త పడేస్తుండడంతో కుప్పగా పేరుకుపోతోంది. చెత్తను సకాలంలో తరలించకపోవడంతో స్థానికులు, అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే బ్రిడ్జిపై రెండు వైపులా వాహనాలు నిలిపేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చాలని, వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. - సీతంపేట

ఏయూలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ, జానపద, బృంద నృత్యాలు, సోలో సింగింగ్, గ్రూప్ సింగింగ్, నాటికలతో విద్యార్థులు అలరించారు. ఏయూ పరిధిలోని 30 అనుబంధ కళాశాలల నుంచి, క్యాంపస్ కళాశాలల నుంచి సుమారు 650 మంది వివిధ అంశాల్లో పోటీపడి సత్తా చాటారు. 150 మందికి పైగా వలంటీర్లు బృంద నాట్యాల్లో పాల్గొని సాంస్కృతిక శోభను విశ్వవిద్యాలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. ముఖ్యంగా థింసా నృత్యం, కోయదొరల విన్యాసం, కోలాటం, జాతర తదితర జానపద నృత్యాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోటీలు నిర్వహించారు. జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు బుధవారం అందిస్తామని జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ డి.సింహాచలం తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులుగా జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ఇతర సీనియర్ ప్రోగ్రాం అధికారులు వ్యవహరించారు.